క్లుప్తంగా

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర



జాతర సందర్భంగా పుష్పాలతో సుందరంగా అలంకరించిన పెద్దింట్లమ్మ ఆలయం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోట మెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఈ నెల 10 నుంచి అమ్మ వారి 55వ వార్షిక జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 8వ తేదీ వరకు అమ్మ వారి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

ఘనంగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



పెదపట్నంలో ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: పెదపట్నంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి వార్ల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, ప్రధాన మండపారాధన, అంకురారోహణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలను వేద పండితులు వైభవంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. 28వ తేదీ గురువారం ఉదయం 9.36 గంటలకు స్వాతీ నక్షత్రయుక్త వృషభ లగ్నంలో విఘ్నేశ్వర ప్రయుక్త సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నేడు వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ పత్రిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆవాహిత మండపాలకు పునఃపూజ, హోమాలు జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు చెప్పారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ముక్కామల వైద్యాధికారి జి.రమ్యశైలజ అన్నారు. మొసలపల్లిలో సురక్ష ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో మూడు కేంద్రాల్లో మంగళవారం జరిగిన పదో తరగతి జీవశాస్త్రం పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట నుంచి 143 మందికి 142, తొండవరం నుంచి 159 మందికి 158, పుల్లేటికుర్రు నుండి 187 మందికి 186 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడు కేంద్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవోలు తెలిపారు.

అభివృద్ధి కోసమే నిధులు ఖర్చు చేశా..

అంబాజీపేట: గ్రామ పంచాయతీ నిధులను అభివృద్ధి కోసమే ఖర్చు చేశానని సర్పంచ్ జల్లి బాలరాజు చెప్పారు. పంచాయతీ నిధులు టీడీపీ సర్పంచ్ స్వాహా అనే వార్తా కథనంపై మంగళవారం ఆయన స్పందించారు. ప్రభుత్వం జమ చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులను ఐదు దఫాలుగా తీసిన మాట వాస్తవమేనన్నారు. ఈ మొత్తాలను గ్రామాల్లో అభివృద్ధి చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించానన్నారు. పీఎఫ్ఎంఎస్ సైట్ ద్వారా డ్రా చేయుటకు అప్పటికి సరైన నియమావళి ఇంకా రానందున, కాంట్రాక్టర్లు ఒత్తిడి తేవడంతో, అభివృద్ధి పనుల నిమిత్తం ముందుగా నగదు డ్రా చేశానన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకులో నిధులు డ్రా చేశానని పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తనకు తెలియదన్నారు. అధికారుల ఫిర్యాదుతో విషయం తెలిసి, తాను ఖర్చు చేసిన వివరాలను తెలియజేశానన్నారు. దీనిపై అధికారులు ఏ సమయంలో వివరాలు తెలియజేయమన్నా చెప్పేందుకు సహకరిస్తానని చెప్పారు.

సఫలం.. భగీరథ యత్నం

- గ్రామం చెంతనే నది ప్రవహిస్తున్నా తాగు నీటికి ఇబ్బందులు
- నేటి జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషితో రూ.1.78 కోట్లతో పథకాల నిర్మాణం
- ఇంటింటికీ తాగునీటి సరఫరా



గంటిలో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, సంపు

కొత్తపేట: చెంతనే నది ఉన్నా.. గుక్కెడు నీటి కోసం తప్పని ఇక్కట్లు. తాగునీటి కోసం అనాధిగా ఆ గ్రామస్తుల ఇబ్బందుల వర్ణనాతీతం. కొత్తపేట మండలం గంటి గ్రామం చెంతనే వశిష్ఠ నది ప్రవహిస్తోంది. అయినా ఆ గ్రామం సురక్షిత నీరుకు నోచుకోలేకపోయింది. చాలీచాలని రక్షిత మంచి నీటి పథకాలున్నా తాగునీరు సరఫరా అంతంత మాత్రమే. చెరువు నీరు. పూర్వం నాటి బావి నీరే గతైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీరు సమస్యను పట్టించుకోలేదు. అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్యే అని నిధుల కేటాయింపులో ఈ నియోజకవర్గాన్ని ఆ ప్రభుత్వం చిన్న చూపు చూసింది. వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి భగీరథ ప్రయత్నంగా ఆయన కృషితో ఆ గ్రామం తాగునీటి సమస్య నుంచి శాశ్వత పరిష్కారం పొందింది. జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.కోట్లు వ్యయంతో తాగునీటి పథకాలు, ఇంటింటికీ కుళాయి పథకం కింద పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తుంది. ఏళ్ల తరబడి గ్రామాన్ని పట్టి పీడిస్తున్న సమస్య పరిష్కారం కావడంతో ఆ గ్రామస్తులు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.కోట్లతో ఎన్నో ఏళ్ల తాగునీటి సమస్య పరిష్కారం

గంటి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య పరిష్కారాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దశల వారీగా జేజేఎం నిధులు సుమారు రూ.1.78 కోట్లు మంజూరు చేయించారు. దానిలో రూ.1.65 కోట్లతో గంటి మెయిన్ విలేజ్‌కు సంబంధించి 90 వేల లీటర్ల ట్యాంకు, 80 వేల లీటర్ల సంపు, 7 కిలోమీటర్లు పైపు లైను, ప్రత్యేకంగా పెదపేటకు సంబంధించి 40 వేల లీటర్ల ట్యాంకు, గంటి పల్లిపాలెం గ్రామంలో పైపులైన్లు నిర్మించారు. ఇంకా వివిధ ప్రాంతాల్లో పైపులైన్లకు రూ.13 లక్షలు మంజూరు చేయించారు. వాటి నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. శుద్ధి చేసిన గోదావరి జలాల్ని ట్యాంకుల్లో, సంపులో నింపి పైపు లైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు.

కుళాయిలతో సమస్యకు పరిష్కారం



మా గ్రామంలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వేసవిలో ట్రాక్టర్లపై ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేసేవారు. వాటిని బిందెలు, డ్రమ్ముల్లో పట్టుకుని ఒబ్బిడిగా తాగేవాళ్లం. ఇప్పుడు కుళాయిలు ఏర్పాటు చేయడంతో గత సమస్యలు పరిష్కారమయ్యాయి. మంచినీరు తాగుతున్నాం.

– ఈరి లక్ష్మి, గంటి పల్లిపాలెం

తాగునీటి సమస్య తీరింది



మా గ్రామానికి అన్నింటి కంటే తాగునీరు సమస్య పట్టి పీడించింది. చెరువు నీరు, పూర్వం నాటి నుయ్యిలో నీరు తోడుకునే వాళ్లం. ఒక మంచినీటి పథకం ఉన్నా అది అలంకార ప్రాయమే. కొంతమేర మాత్రమే నీటి సరఫరా అయ్యేది. అది కూడా కలుషిత నీరే. గత పాలకులు తాగునీటి సమస్యను ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇన్నేళ్లకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి ఫలితంగా జగన్ ప్రభుత్వంతో పరిష్కారమైంది.

– యన్నపు నందివరప్రసాద్, గంటి

నర్సింహరాజుకు పలువురి సత్కారం



పి.గన్నవరంలో నర్సింహరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు



కత్తిమండలో ఎమ్మెల్యే రాపాకను కలసిన ఇందుకూరి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన రాజులపాలెం గ్రామానికి చెందిన ఇందుకూరి నర్సింహరాజు మంగళవారం పి.గన్నవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా విప్పర్తికి నర్సింహరాజు పుష్పగుచ్ఛం అందించారు. నర్సింహరాజును విప్పర్తి దుశ్శాలువాతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పాటుపడాలని విప్పర్తి సూచించారు. పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నర్సింహరాజు అన్నారు. అలాగే నర్సింహరాజును మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, యన్నాబత్తుల ఆనంద్, నాయకులు దొమ్మేటి వెంకటశివరామన్, నక్కా గోపి, గుత్తుల మధు, పెన్మెత్స విశ్వనాథరాజు, జల్లి శ్రీను, దొమ్మేటి దుర్గారావు, మానికిరెడి లక్ష్మణరావు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు.

నగరంలో..

మామిడికుదురు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన ఇందుకూరి నరసింహరాజు మంగళవారం నగరం గ్రామంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహరాజును ఎమ్మెల్యే చిట్టిబాబు శాలువాతో సన్మానించి, అభినందించారు.

రాపాకను కలసిన ఇందుకూరి

మలికిపురం: అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద రావును పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరశింహరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలిసి ప్రస్తుత ఎన్నికలలో పార్టీ విజయంపై చర్చించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



సత్తిబాబుకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: కొత్తపేట నియోజకవర్గంలో కులాలు, మతాలకు అతీతంగా రాజకీయాలు చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం వాడపల్లిలో టీడీపీ నుంచి సర్పంచ్‌గా పోటీ చేసిన ఏపుగంటి సత్తిబాబు ఆ పార్టీని వీడి తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్‌కి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో భారీగా జరుగుతున్నాయన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలు మాత్రం సీఎం జగన్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోచిరాజు బాబూరావు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



వేగివారిపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఆ పార్టీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం వేగివారిపాలెంలో సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి ఇంటి వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అభ్యర్థి గొల్లపల్లి పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలు సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పరిపాలన సాగించారన్నారు. మరోసారి ఈ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవడం ద్వారా పేదలకు మరింత సంక్షేమం అందుతుందని ఆయన అన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బండారు కాశీ, పప్పొప్పుల సత్యసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే కాపులకు సముచిత స్థానం



ఆలమూరులో కాపు కల్యాణ మంటపం నిధుల మంజూరుపై మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ నేతృత్వంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హయాంలోనే కాపులకు సముచిత స్థానం లభించిందని, అన్ని విధాలా ఆదరణ చెందుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. ఆలమూరు కాపు కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడారు. కాపు కల్యాణ మండపం నిధుల మంజూరుపై టీడీపీ నేతల ఆరోపణలు నిరాధారమన్నారు. 2014లో అప్పటి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కల్యాణ మండపానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారన్న సంగతిని వారు గుర్తు చేశారు. అలాగే అవిడిలో రూ.పది లక్షలు మంజూరు చేశారన్నారు. కాపుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి నేరుగా నిధులను లబ్ధిదారుల ఖాతాలోకే జమ చేస్తుందన్నారు. అలాగే స్థానిక కల్యాణ మండపానికి హామీ ఇచ్చిన రూ.15 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులు ఎన్నికల కోడ్ ముగియగానే జమ అవుతాయన్నారు. ఎన్నికలకు ముందే టీడీపీ కాపు నేతలకు కాపులు గుర్తుకు రావడం వారి నైజాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కాపు కల్యాణ మండపాన్ని మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు చల్లా నానాజీ, దొండపాటి వీర వెంకట్రావు, ఉండమట్ల బూరయ్య, నామన దుర్గాప్రసాద్, రావూరి శివ, చల్లా భూషణం, శ్రీపతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు బొజ్జల బహిరంగ క్షమాపణ చెప్పాలి



పి.గన్నవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: కరోనా వంటి విపత్కర సమయంలో సైతం ప్రాణాలు లెక్కచేయకుండా ప్రజలకు విశేష సేవలు అందించిన వలంటీర్లను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఉగ్రవాదులతో పోల్చడాన్ని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తీవ్రంగా ఖండించారు. వలంటీర్లకు బొజ్జల బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లను ప్రజలంతా సొంత బిడ్డల్లా ఆదరిస్తుంటే.. టీడీపీ, జనసేన పార్టీ నేతలు మాత్రం ఉగ్రవాదులు, నక్సలైట్లు అంటూ అవమానిస్తున్నారని అన్నారు. ఇది సహించరానిదని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లను ఈ రకంగా అవమానించడానికి వారికి నోరెలా వస్తున్నదని అన్నారు. వలంటీర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం మాత్రమే ఇస్తుందని వివరించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కొమ్ముల రాము, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసుబాబు, రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్, గుత్తుల మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరూ మేలుకో..

నమోదుకు ఏప్రిల్ 15 తుది గడువు

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల రోజు ఓటు వేయాలి అంటే ముందుగా మీరు ఓటరుగా నమోదు చేసుకుని ఉండాలి. ఓటరుగా నమోదు చేసుకుని ఉన్నా తుది జాబితాలో మీ పేరు లేకుంటే ఓటు వేసేందుకు అనర్హులు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది ఓటరు జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు దరఖాస్తు దారుల వివరాలను పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేరుస్తారు.

ఆన్‌లైన్‌లో...

ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. న్యూ స్టేటస్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రసుకు వచ్చి మీ వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటరు పోర్టల్.ఈసీఐ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించుకున్నాక మీ పేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటు హక్కును దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆఫ్‌లైన్‌లో ఇలా...

18 ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లకు మీరు నేరుగా ఫాం–6 దరఖాస్తులు అందజేయవచ్చు. మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయాల్లో కొత్త ఓటరు కోసం పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయొచ్చు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత మాత్రమే మీ పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటు హక్కు ఎలా చేసుకోవాలి లేదా ఇంకేమైన సందేహాలు ఉంటే బీఎల్వోలను, తహసీల్దార్ కార్యాలయ పని వేళ్లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ



చెముడులంకలో నిర్వహించిన జాస్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)తో పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని చెముడులంక–2 గ్రామ సచివాలయంలో మంగళవారం జాస్ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, డి.మల్లికార్జున్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 259 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీ పథకం కింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి, ఆరోగ్య ఆశ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నామినేషన్ డిపాజిట్‌గా పది రూపాయల నాణేలు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల ప్రక్రియలో మంగళవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రామదాస్ అనే ఇండిపెండెంట్ అభ్యర్థి పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.కులొత్తుంగన్‌కు అందజేశారు. నామినేషన్ డిపాజిట్‌గా చెల్లించాల్సిన రూ.12,500 సొమ్మును పది నాణేల రూపంలో పెద్ద ప్లేటులో తీసుకొచ్చి అందించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఆ నాణేలను లెక్కించి తీసుకున్నారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన రామదాస్ ఓ లిక్కర్ షాపులో క్యాషియర్‌గా చేస్తున్నారు. ఇటీవలి పది నాణేలను తీసుకోకుండా పలు చోట్ల తిరస్కరిస్తున్నారని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే అలా చేసినట్లు ఆయన తెలిపారు.

దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వూటుకూరి

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఎన్నికయ్యారు. మంగళవారం బండారులంకలో దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రెండోసారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పిచ్చిక శ్యామ్, పిచ్చిక పోలిశెట్టి, ప్రధాన కార్యదర్శిగా పుత్సల వరదరాజులు, కోశాధికారిగా దైవపు నందయ్య, మీడియా కోఆర్డినేటర్‌గా కార్టూనిస్ట్ మాడా రాము, సంఘం సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

గొల్లపల్లికి సత్కారం



మోరిలో రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కేడర్

సఖినేటిపల్లి: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి బడుగు, బలహీన వర్గాలు గౌరవంగా జీవించేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం మోరిలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆయన ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ క్యాడర్ సత్కరించింది. రాష్ట్రంలో మరోసారి సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేటట్టు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన రాంబాబు, సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, పార్టీ చేనేత ప్రతినిధి జాన శంకరరావు, ఈద రవిరెడ్డి, చెల్లుబోయిన రెడ్డి, పసలపూడి భగవాన్ శ్రీనివాస్, ముప్పర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపల్లి తనయుడి ఆత్మీయ కలయిక



రామేశ్వరంలో ఆత్మీయ కలయికలో పాల్గొన్న శ్రీధర్

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరంలో మంగళవారం రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు తనయుడు గొల్లపల్లి శ్రీధర్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడు బళ్ల లక్ష్మణ్ ఇంటి వద్ద జరిగిన ఒక సమావేశంలో శ్రీధర్‌తో పాటు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఐ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: స్థానిక హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తైక్వాండో బెల్ట్ పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులు సాధించారు. ఈనెల 25న మండపేటలో ఒలింపిక్ గేమ్స్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో విద్యార్థులు కె.అనుశ్రీ, కార్తిక్, వీఎస్ కార్తికేయ, వి.గిరిజ, ఆర్ఎస్వీ అఖిల్, జి.జాయ్ కిరణ్, చైతన్య ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకుని పోటీలకు ఎంపికయ్యారు. ఈవిద్యార్థులను టీచర్లు అభినందించారు.

అర్హత ఉన్నవారు ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రావులపాలెం: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ డీవీవీఎస్ అశోక్‌వర్మ అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్‌సీ రోడ్డు విక్టరీ గొడౌన్ ప్రాంతంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం (ఎస్‌వీఈఈపీ)పై అవగాహన కల్పించారు.

శ్రీనివాసరావుకు పరామర్శ

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కె.జగన్నాథపురం సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి భర్త శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు పరామర్శించారు. శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయన యోగక్షేమాలను వేణుగోపాలరావు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.